క్లుప్తంగా

జీవీఎంసీకి మంచినీటి ట్యాంకర్ అందజేత



జెడ్పీకి వాటర్ ట్యాంకర్ తాళాలను అందజేస్తున్న స్టీల్‌ప్లాంట్ సీజీఎం ప్రవీణ్‌కుమార్

ఉక్కునగరం/అగనంపూడి: స్టీల్‌ప్లాంట్ కార్పొరేట్ ఎన్విరాన్‌మెంటల్ రెస్పాన్సిబిలిటీ (సీఈఆర్) కార్యక్రమాల్లో భాగంగా 6 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంకర్‌ను జీవీఎంసీకి అందించింది. ఈ మేరకు జీవీఎంసీ జోనల్ కమిషనర్ బి.సన్యాసినాయుడుకు స్టీల్‌ప్లాంట్ సీజీఎం ప్రవీణ్‌కుమార్ ట్యాంకర్ తాళాలు అందజేశారు. ఈ సందర్భంగా సీజీఎం మాట్లాడుతూ 16 విలీన పంచాయతీల పరిధిలోని గ్రామాలు, కాలనీలకు గత ఎనిమిదేళ్లగా స్టీల్‌ప్లాంట్ ట్యాంకర్ల ద్వారా మంచినీటిని సరఫరా చేస్తోందన్నారు. వీటికి అయే వ్యయాన్ని ఏటా వేసవిలో విశాఖ ఉక్కు సంస్థ భరిస్తోందని తెలిపారు. నీటిని సరఫరా చేసేందుకు వీలుగా వాటర్ ట్యాంకర్‌ను అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఈఈ పి.కనకరావు, ఏఈ టి.రాజ్‌కుమార్, స్టీల్‌ప్లాంట్ హెచ్ఆర్, సీఈఆర్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

తిరుమల బాలాజీకి విశేష పూజలు



విశేష అలంకరణలో స్వామి వారు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో శనివారం విశేష పూజలు జరిగాయి. తిరుమలేశునికి వేకువజామునే సుప్రభాత సేవ, తోమాల సేవ నిర్వహించారు. అర్చన అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. సాయంత్రం స్వామి వారికి విశేష పుష్పాలతో సహస్రనామార్చన జరిగింది. అనంతరం కుంభహారతి, నక్షత్ర హారతులు ఇచ్చారు. దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి.

ఎంవీఆర్‌లో 11న పూల్ క్యాంపస్ డ్రైవ్

గాజువాక: ఎంఎస్ఎన్ లేబొరేటరీస్‌లో ఉద్యోగాల భర్తీకి స్థానిక ఎంవీఆర్ డిగ్రీ కళాశాలలో ఈనెల 11న పూల్ క్యాంపస్ డ్రైవ్ నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఎ.బాలకృష్ణ తెలిపారు. 2021 నుంచి 2024 మధ్యలో ఉత్తీర్ణులైన బీఎస్సీ కెమిస్ట్రీ పట్టభద్రులు ఈ ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చని పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు తమ బయోడేటా, పాస్‌పోర్టు సైజ్ ఫొటో, విద్యార్హతకు సంబంధించిన సర్టిఫికెట్లతో మంగళవారం ఉదయం 9.30 గంటలకు ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు.

సముద్రాలను కాపాడుకోవాలి

బీచ్‌రోడ్డు: మన సముద్రం మన వాతావరణం కోసం కృషి చెయ్యాలని యాక్షన్ ఎయిడ్ సంస్థ ఫెలోషిప్ ప్రతినిధి ఐ.కృష్ణ కుమారి కోరారు. ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సం సందర్భంగా శనివారం సాయంత్రం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏడాది పొడవునా ప్రపంచ వ్యాప్తంగా మహా సముద్రాలను కాపాడుకోవాల్సిన రోజులే అని ప్రతి ఒక్కరు గుర్తించాలన్నారు. ఒక మహా సముద్రం, ఒకే వాతావరణం, ఒక్కటే మన భవిష్యత్తు అనే ఆలోచనతో సమష్టిగా కృషి చెయ్యాలన్నారు. సమస్త జనావళిని సముద్రాల పరిరక్షణకు చైతన్య వంతులు చేయాలన్నారు. 2030 నాటికి సముద్ర ఆధారిత పరిశ్రమల ద్వారా 40 మిలియన్ల మందికి ఉపాధి లభిస్తుందన్నారు. కార్యక్రమంలో గ్రీన్ క్లైమేట్ టీం వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం పాల్గొన్నారు.

అధునాతన వసతులతో..

- దువ్వాడ రైల్వేస్టేషన్‌లో అందుబాటులోకి మరుగుదొడ్లు
- 4వ నంబర్ ప్లాట్‌ఫాం ఆరుబయట నిర్మాణం
- రూ.15 లక్షలతో ఆధునికీరించిన జీవీఎంసీ



పాత మరుగుదొడ్ల కాంప్లెక్స్ (నాడు)



దువ్వాడ రైల్వేస్టేషన్ ఆరుబయట ఆధునికీకరించిన మరుగుదొడ్లు (నేడు)



కొత్తగా ఏర్పాటు చేసిన యూరినల్ బౌల్స్ ఏరియా



హ్యాండ్‌వాష్, హ్యాండ్ డ్రయ్యర్

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ ఆరుబయట జీవీఎంసీ నిర్మించిన మరుగుదొడ్ల సముదాయం ఆధునికీరణ అనంతరం అందుబాటులోకి వచ్చింది. సుమారు పది సంవత్సరాల క్రితం స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా జీవీఎంసీ నిధులతో నాలుగో నంబర్ ప్లాట్‌ఫాం వైపు మరుగుదొడ్ల సముదాయాన్ని ఏర్పాటు చేశారు. అయితే రన్నింగ్ వాటర్ సౌకర్యం లేకపోవడం, నిర్వహణ భారంగా మారడంతో నిరాదరణకు గురైంది. సరైన సదుపాయాలు లేక క్రమేపీ నిరుపయోగంగా మారింది.

దువ్వాడ రైల్వేస్టేషన్ యూజర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి మేరకు వీటిని ఆధునికీకరించి అదనపు వసతులు కల్పించేందుకు జీవీఎంసీ సిద్ధమైంది. 8 మాసాల క్రితం పనులు ప్రారంభించిన జీవీఎంసీ ప్రవేశ మార్గంలో మెట్లు తొలగించి ర్యాంప్‌లను ఏర్పాటు చేసింది. పాత సిట్‌అవుట్లను తొలగించి కొత్తవి అమర్చారు. యూరినల్ బౌల్స్ కొత్తగా ఏర్పాటు చేశారు. ఫ్లోరింగ్, వాల్‌టైల్స్, వెస్టర్న్ టాయిలెట్స్, గీజర్, పీవీసీ తలుపులు, ఎగ్జాస్ట్ ఫ్యాన్లు, పెయింటింగ్‌లు, ప్రధాన ద్వారానికి గేట్లు వంటి సౌకర్యాలతో టాయిలెట్లకు అధునాతన హంగులు కల్పించారు. వీటి నిర్వహణను కూడా జీవీఎంసీ చేపట్టడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ సిబ్బంది, దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు, దువ్వాడ వీఎస్ఈజెడ్‌లోని వివిధ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగులు, ఆటో స్టాండ్ డ్రైవర్లకు మరుగు సమస్య తొలగినట్లేనన్నారు.

22న కంచిపాటి గురుమూర్తి స్మారక పురస్కారాలు



స్మారక పురస్కారాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శతక కవి సీపాన రమేష్‌బాబు

అగనంపూడి: కంచిపాటి గురుమూర్తి స్మారక పురస్కారాల పోస్టర్‌ను శతక కవి సీపాన రమేష్‌బాబు ఆవిష్కరించారు. అగనంపూడి సీడబ్ల్యూసీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ యువ కవి కంచిపాటి వెంకట్ తన తండ్రి పేరుతో స్మారక పురస్కారాలు అందించడంతో పాటు కథలు, కవితల పోటీలు నిర్వహిస్తూ కళాకారులను ప్రోత్సహిస్తుండడం సంతోషంగా ఉందన్నారు. ఈ నెల 22న నిర్వహించనున్న స్మారక పురస్కారాల కార్యక్రమంలో కవితలు, కథల పోటీల విజేతలకు నగదు పారితోషకం అందిస్తారన్నారు. కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు పట్నా పూర్ణచంద్రరావు, బలిరెడ్డి సత్యనారాయణ, డీఎస్ఎస్ ప్రసాద్, మస్తాన్‌రెడ్డి, కరణం పైడిరాజు, బి.వి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

భాగస్వామ్య పార్టీలు 'ఉక్కు' పరిరక్షణకు సహకరించాలి



దీక్ష శిబిరంలో పాల్గొన్న పరిరక్షణ కమిటీ నాయకులు, ఉక్కు కార్మికులు

అగనంపూడి: కేంద్రంలో పూర్తిస్థాయి మెజార్టీతో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు కానందున సంకీర్ణ ప్రభుత్వంలోని ఎన్‌డీఏ పాలనలో విశాఖ ఉక్కు పరిరక్షణకు ముందడుగు వేయాలని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు విళ్లా రామ్మోహన్‌కుమార్, డి.ఆదినారాయణ అన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో చేపడుతున్న దీక్ష శిబిరంలో 1213వ రోజు కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఇప్పటి వరకు ఎదిరించే వారు లేక, ఎదురు చెప్పే పరిస్థితి లేకపోవడంతో ఏడు దశాబ్దాల నాటి ప్రభుత్వ రంగ సంస్థలను ఒకరిద్దరు బడాబాబులకు అప్పగించే ధోరణి కొనసాగిందన్నారు. ఈ పరిస్థితులు ఇప్పుడు లేనందున ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉన్న పార్టీలు పెద్ద మనసు చేసుకుని విశాఖ ఉక్కు పరిరక్షణకు సహకరించాలని కోరారు. విశాఖ ఉక్కు పరిశ్రమను అమ్మేస్తే ఒక వ్యక్తి బాగుపడతాడని, అదే పరిరక్షిస్తే లక్షల మందికి ప్రత్యక్షంగా పరోక్షంగా సహాయపడే వారుగా చరిత్రలో మిగిలిపోతారని అన్నారు. దీక్షల్లో ఉక్కులోని సీవో అండ్ సీసీపీ విభాగానికి చెందిన కార్మికులు కూర్చున్నారు. కార్యక్రమంలో నాయకులు వరసాల శ్రీనివాసరావు, టి.కనకరాజు, శివరామకృష్ణ, మెహీద్దీన్, జగన్నాథరావు, నరసింగరావు, పెంటారావు, రాము, రామచంద్రరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కార్యదీక్ష, పట్టుదలతోనే లక్ష్యసాధన



సంతోష్‌కుమార్‌ను సత్కరిస్తున్న కళాశాల ప్రతినిధులు

అగనంపూడి: ప్రతీ ఒక్కరిలో పోటీతత్వం ఉంటుందని, వాటికి అనుగుణంగా కార్యదీక్ష, పట్టుదల ఉన్నప్పుడే తాను అనుకున్న లక్ష్యాన్ని సాధించగలరని పోటీ పరీక్షల ట్రైనర్ సంతోష్‌కుమార్ అన్నారు. అలాంటి వారే జీవితంలో ఉన్నత స్థానానికి చేరగలరన్నారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు బ్యాంకింగ్, ఆర్ఆర్‌బీ, ఎస్ఐ, స్టాఫ్ సెలక్షన్ కమిషన్ పోటీల పరీక్షలపై అవగాహన, కెరీర్ గైడెన్స్‌పై శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ పోటీ పరీక్షలకు గల అవకాశాలు వివరించారు. పరీక్షలకు ఎలా సిద్ధం కావాలి, ఎన్ని గంటలు చదవాలి, ఎలా చదవాలి, మెలకువలు, పరీక్షల సమయంలో జవాబులు రాసే విధానం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు, కోఆర్డినేటర్ వెంకట నాగరాజు తదితరులు మాట్లాడారు.

సాగరతీర స్వచ్ఛతలో ఏయూ విద్యార్థులు



బీచ్ క్లీనింగ్ కార్యక్రమం ప్రారంభిస్తున్న రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్



వ్యర్థాలను ఏరివేస్తున్న రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

ఏయూక్యాంపస్: ప్రపంచ సముద్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రవిశ్వవిద్యాలయం విద్యార్థులు బీచ్‌క్లీన్ కార్యక్రమం నిర్వహించారు. శనివారం ఉదయం 6 గంటలకు ఆర్‌కె బీచ్ నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమం 8 గంటలకు వైఎంసీఏ వద్ద ముగిసింది. కార్యక్రమంలో ఏయూ విద్యార్థులు, ఎన్‌సీసీఆర్, సీఎంఎఫ్ఆర్ఐ, సీఐఎఫ్‌టీ శాస్త్రవేత్తలు, సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ ప్రారంభించారు. కార్యక్రమంలో సమన్వయకర్త ఆచార్య పి.జానకీరామ్ తదితరులు ప్రసంగించారు. 250 మందికి పైగా వలంటీర్లు పాల్గొని బీచ్‌లో వ్యర్థాలను ఏరివేసి జీవీఎంసీ పారిశుధ్య సిబ్బందికి అందజేశారు.

మార్మోగిన గోవింద నామస్మరణ



శ్రీవారిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు

కొమ్మాది : రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. శ్రీవారికి ప్రీతికరమైన రోజు కావడం తోపాటు, సెలవు రోజు కావడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు శ్రీవారి దర్శనానికి భక్తులు పెద్ద ఎత్తున బారులు తీరారు. వేకువజామున సుప్రభాత సేవ, తోమాల సేవ, అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ముందుగా శ్రీవారి పాదాల వద్ద మహిళలు పసుపు, కుంకుమ సమర్పించారు. అనంతరం మహాలక్ష్మి, గోదాదేవిని దర్శించుకున్నారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో కోలాటాలు, శ్రీవారి నామ సంకీర్తన భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

- శ్రీవారి ఆలయంలో రెండో శనివారం కావడంతో లడ్డూ విక్రయాలు జోరుగా సాగాయి. 750 గ్రాముల కళ్యాణ లడ్డూ రూ.200, 140 నుంచి 170 గ్రాముల బరువు గల సాధారణ లడ్డూ రూ.50లకు భక్తులకు విక్రయించారు. ఇక్కడ కూడా భక్తులు బారులు తీరారు.

బాలికలకు వరం బాలసదనం



వసతి గృహం లోపల విశాల ప్రాంగణం



బాల సదనం వసతి గృహం

అడ్మిషన్లకు గడువు ఈ నెల 12

భీమునిపట్నం: అనాథ, నిరుపేద బాలికలకు భీమిలిలోని బాల సదనం వసతి గృహం వరంలా మారి ఆదుకుంటోంది. మహిళ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ వసతి గృహంలో ఒకటో నుంచి ఐదో తరగతి వరకు తల్లిదండ్రులను కోల్పోయిన వారు, తల్లి లేక తండ్రిని కోల్పోయిన వారు, నిరుపేదలు, దివ్యాంగుల పిల్లలకు కుల, మతాలతో సంబంధం లేకుండా ప్రవేశం కల్పిస్తారు. ఇందులో 30 ఖాళీలు ఉండగా ఈ నెల 12వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇక్కడ చేరే వారిని సమీపంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి బాలసదనంలో వసతి, భోజన సదుపాయం కల్పిస్తారు. బాలసదనంలో చేరి చదువుకునే పిల్లలకు విశాలమైన ప్రాంగణంతోపాటు మంచి గదులు, అందులో మంచాలు ఉంటాయి. బాలికలకు దుస్తులు, పౌడర్ డబ్బాలు, సబ్బులు, ఇతర అవసరాలకు సంబంధించినవి అందిస్తారు. అలాగే విజ్ఞానానికి సంబంధించిన చక్కని పుస్తకాలతో చిన్న గ్రంథాలయం, క్యారమ్స్, షటిల్ బ్యాడ్మింటన్ ఆడుకునే సదుపాయం ఉంది. ఇక్కడ యోగా కూడా నేర్పుతారు. బాలసదనంలో సూపరింటెండెంట్‌తోపాటు మ్యాట్రిన్, హెల్పర్, స్టోర్ కీపర్, హౌస్ కీపర్, ఎడ్యుకేటర్, యోగా టీచర్, ఇతర సిబ్బంది ఉన్నారు. వీరంతా పిల్లలను ప్రత్యేకంగా పర్యవేక్షిస్తారు. ఇక్కడ చేరాలనుకునే వారు పూర్తి వివరాల కోసం బాల సదనం సూపరింటెండెంట్ కె.ప్రమీలను 7893514460లో సంప్రదించవచ్చు.

సిరుల తల్లికి సహస్ర తులసీదళార్చన



డాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలో కొలువుదీరిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. అమ్మవారికి ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీదళార్చనలో పాల్గొన దలచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ కార్యనిర్వహణాధికారి పి శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్త రోడ్డు శాఖ, అకౌంట్ నెంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806081లో చెల్లించవచ్చన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసులరెడ్డి, సహాయ కార్యనిర్వహణాధికారులు కె.తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటిస్తే మలేరియాకు చెక్



దేవాడ పీహెచ్‌సీ వద్ద అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ప్రదీప్ ప్రసాద్ రాజా

పెదగంట్యాడ: మలేరియా సోకకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని దేవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్ ప్రసాద్ రాజా సూచించారు. మలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్ ప్రసాద్ రాజా ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమలు వృద్ధి చెందకుండా ఉండేలా చూసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. తాగి పడేసిన కొబ్బరి బొండాలు ఉంచరాదని, పాత టైర్లలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. అలాగే డ్రమ్ములు, నీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో ఎం.శ్రీనివాసరావు, బి.గోపాలం, ఆశ వర్కర్లు రేలంగి పార్వతి, షాయినా పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు జీతాలు చెల్లించాలి



యుటిలిటీస్ విభాగం వద్ద ధర్నా చేస్తున్న యూనియన్ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ యుటిలిటీస్ విభాగానికి చెందిన కాంట్రాక్ట్ కార్మికులకు వెంటనే జీతాలు చెల్లించాలని ఉక్కు కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బొడ్డు పైడిరాజు డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు, కార్మికులు విభాగాధిపతి కార్యాలయం వద్ద శనివారం ధర్నా చేశారు. విభాగంలో కాంట్రాక్ట్ పనులు చేస్తున్న ఉమా కన్‌స్ట్రక్షన్‌లో 33 మంది కార్మికులు పని చేస్తున్నారని, వారికి మూడు నెలలుగా జీతాలు చెల్లించడం లేదని తెలిపారు. వారికి పీఎఫ్, ఈఎస్ఐ కూడా కట్టకపోవడంతో కార్మికులు ఇబ్బంది పడుతున్నారన్నారు. సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం విభాగాధిపతికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బి.రమణ, శంకరరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న అండిబోయిన లక్ష్మి

పెదగంట్యాడ: క్రీడాకారులను ప్రోత్సహించేందుకు పోటీలు దోహదం చేస్తాయని ఆంధ్ర రాష్ట్ర యాత సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు అండిబోయిన లక్ష్మి అన్నారు. ఏపీ స్టేట్ పవర్ లిఫ్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అండిబోయిన అప్పారావు, కార్యదర్శి మర్ల భాస్కర రావు ఆధ్వర్యంలో థర్డ్ ఏపీ స్టేట్ డెడ్లిఫ్ట్ చాంపియన్ షిప్–2024, ఫోర్త్ ఏపీ స్టేట్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్–2024, సిక్త్ ఏపీ స్టేట్ బ్రెంచ్ ప్రెస్ చాంపియన్ షిప్–2024 పోటీలను శనివారం ప్రారంభించారు. మండలంలోని హౌసింగ్ బోర్డు కాలనీలోని సీడబ్ల్యూసీలో ఏర్పాటు చేసిన ఈ పోటీలు రెండు రోజుల పాటు నిర్వహించనున్నారు. ఈ పోటీలకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి సుమారు 200 మంది క్రీడాకారులు హాజరయ్యారు. సబ్ జూనియర్స్, సీనియర్స్, మాస్టర్ కేటగిరి తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నారు. విజేతలకు గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్‌తో పాటు సర్టిఫికెట్లను ప్రదానం చేయనున్నారు. ఈ పోటీల్లో విజయం సాధించిన వారిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నామని అధ్యక్ష కార్యదర్శులు తెలిపారు. కార్యక్రమంలో ప్రసాద్, గుడాల దుర్గ, శ్రీలత, పేర్ల సత్యారావు, కోదండరావు, అప్పారావు, సీహెచ్ అప్పలరాజు, రాంబాబు, శ్రీను, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేత్ర పర్వం.. అప్పన్న నిత్య కల్యాణం



మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు



పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం,జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో స్వామివారి నిత్యకల్యాణాన్ని నేత్ర పర్వంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదాన్ని అధికారులు అందజేశారు.

చుక్కల జింకల సందడి



కంబాలకొండ రోడ్డు పక్కన పచ్చిక మేస్తున్న చుక్కల జింకలు

ఆరిలోవ: కంబాలకొండ రిజర్వుడ్ ఫారెస్ట్‌లో కుప్పలుగా జింకలు ఉన్నాయి. సహజసిద్ధమైన అటవీ ప్రాంతం కావడంతో కొండకోనల్లో ఇవి గుంపులుగా తిరుగుతూ కంబాకొండ ఎకో టూరిజం పార్కులోకి చేరి సందర్శకులను అలరిస్తున్నాయి. కొండల నుంచి బయటకు వచ్చిన చుక్కల జింకలు ఇక్కడ ఎక్కువగా తిరుగుతుంటాయి. గంపులుగా కంబాలకొండ కొను వద్దకు చేరుకొని దానిలో నీరు తాగి దాహం తీర్చుకొంటాయి. అనంతరం అన్నీ కలసి మేత కోసం పరుగులెడుతుంటాయి. ఇవి పార్కు లోపల నుంచి జాతీయరహదారిపైకి పచ్చిక మేత కోసం తరుచూ వస్తున్నాయి. చెంగుచెంగున గెంతులు వేస్తూ రహదారిపై వెళుతున్న వాహనచోదకులను కనువిందు చేస్తున్నాయి. కంబాలకొండ పార్కు ముఖ ద్వారం పక్కన ఎక్కువగా ఇవి తిరుగుతూ కనిపిస్తున్నాయి. ఇలా కొండల నుంచి బయటకు వస్తున్న జింకలు రోడ్డుపై వెలుతున్న వాహనాల శబ్దాలకు బెదిరిపోయి ఒక్కోసారి గాబరాతో పరుగులు తీస్తున్నాయి. ఆ క్రమంలో ఎటు వెళ్లాలో తెలియక రోడ్డుమీద ప్రయాణించే వాహనాలకు అడ్డంపడి ప్రాణాలు కోల్పోతున్నాయి. గతంలో పలుసార్లు కంబాలకొండ, జూ పార్కు సమీపంలో జాతీయ రహదారిపై పలు జింకలు, అడవి పందులు వాహనాలకు అడ్డంపడి ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఇవి రోడ్డు మీదకు చేరడానికి వీలులేకుండా అటవీశాఖ అధికారులు బలమైన కంచె ఏర్పాటు చేస్తే వాటి ప్రాణాలకు రక్షణ కలుగుతుందని వన్యప్రాణి ప్రేమికులు భావిస్తున్నారు.